

నేటి పత్రిక

# ప్రజా వార్త

NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వారపత్రిక



TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL

Prajavatha-Online Telugu News

http://www.prajavartha.com

వీక్షించండి .. చదవండి... చెప్పండి...



విజయవాడ | తేదీ: 1 - 7 మే 2023 | ఎడిటర్ : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి : 2 | సంచిక : 47 | పేజీలు : 4, వెల: రూ.5


# అన్ని ప్రాంతాలు బాగుపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

**- వలసల ఉత్తరాంధ్ర జాబ్‌హబ్‌గా మారబోతోంది : సీఎం జగన్**





**విజయనగరం, నేటి పత్రిక ప్రజావార్త :**
అన్ని ప్రాంతాలు బాగాపడాలన్నదే ఈ ప్రభుత్వ లక్ష్యం, అందుకే వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం.. సవరవల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు ఉత్తరాంధ్ర అంటే వలసలు గుర్తొచ్చేవి. కానీ, రాబోయే రోజుల్లో జాబ్‌హబ్‌గా మారుతుందని సీఎం జగన్ పేర్కొన్నారు. మూలపేటలో ఈ మధ్యే పోర్టుకు శంకుస్థాపన చేశాం. ఇప్పుడు భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు కేంద్ర బిందువుగా మారనుందని సీఎం జగన్ ఆకాంక్షించారు. ఇవాళే అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయబోతున్నాం. డేటా సెంటర్‌తో ఏపీ ముఖచిత్రమే మారబోతోందని సీఎం జగన్ పేర్కొన్నారు. ఇవాళ ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేయడాన్ని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్నికలకు నాలుగైదు నెలల ముందు హడావిడిగా కొబ్బరి కాయలు కొట్టారు. పైగా మేమే శంకుస్థాపనలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారు. సుప్రీం కోర్టు, ఎన్జీటీలలో కేసులు వేసి అడ్డుపడ్డారు. అన్ని ఆటంకాలు దాటుకుని ఇవాళ ఎయిర్‌పోర్ట్‌కి శంకుస్థాపం చేసుకున్నాం. రైతన్నల వల్లే ఈ ప్రాజెక్టు వచ్చింది. మెడికల్ టూరిజం, ఐటీ, ఇండస్ట్రీస్‌కు కేంద్ర బిందువుగా భోగాపురం ఎయిర్‌పోర్ట్ మారబోతోంది అని సీఎం జగన్ పేర్కొన్నారు.

2026లో మీ బిడ్డనే (సీఎం జగన్ తనను ఉద్దేశించుకుంటూ..) వచ్చి ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభిస్తాడని, ప్రజల ఆశీస్సులు ఉన్నంతకాలం ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఫలించవని ధీమా వ్యక్తం చేశారాయన. 24 నుంచి 30 నెలల్లోనే ఎయిర్‌పోర్ట్ పూర్తి చేస్తామని జీఎంఆర్ హామీ ఇచ్చింది. ఏ380 డబుల్ డెక్కర్ ల్యాండ్‌అయ్యేలా.. ఏర్పాట్లు చేస్తాం. మొదటి ఫేజ్‌లో 60 లక్షల జనాభాకు సదుపాయలు సమకూరుస్తాం. చివరి దశకు వచ్చే సరికి నాలుగు కోట్ల ప్రజలకు సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని సీఎం జగన్ తెలిపారు. ఉత్తరాంధ్ర పేరు చెప్పగానే.. మన్నెం వీరుడు అల్లూరి గుర్తుకొస్తారు. ఉత్తరాంధ్ర అంటే ఉత్తరాంధ్ర అంటే మన్యం వీరుడి పౌరుషం. బ్రిటీషర్లను గడగడలాడించిన అల్లూరి జన్మించిన గడ్డ ఇది. అందుకే కొత్త జిల్లాకు అల్లూరి పేరు పెట్టుకున్నాం. అభివృద్ధికి సులువుగా ఉండాలనే ఉన్న మూడు జిల్లాలను.. ఆరు జిల్లాలను చేశాం. ఉద్దానంలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేశాం. జూన్‌లోనే కిడ్నీ రీసెర్చ్ సెంటర్లను జాతికి అంకితం చేస్తాం. ఇచ్ఛాపురం, పలాసలకు రక్షిత తాగు నీరు అందిస్తాం. సాలూరులో ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం అని సీఎం జగన్ తెలిపారు. ఈ సెప్టెంబర్ నుంచే విశాఖ నుంచి పాలన నడుస్తుందని మరోసారి భోగాపురం బహిరంగ సభ వేదికగా సీఎం జగన్ స్పష్టం చేశారు.





## సీఎం జగన్ విజన్, లీడర్‌షిప్, పాలసీలు, ఆలోచనలు, మౌలికసదుపాయాల కల్పనపై పెడుతున్న దృష్టి అభినందనీయం



**విజయనగరం, నేటి పత్రిక ప్రజావార్త :**
ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ.. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగసభలో జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ గ్రంథి మల్లికార్జునరావు మాట్లాడుతూ సీఎం జగన్ విజన్, లీడర్‌షిప్, పాలసీలు, ఆలోచనలు, మౌలికసదుపాయాల కల్పనపై పెడుతున్న దృష్టిని ఆయన అభినందించారు. ఈ రోజు నాకు చాలా సంతోషంగా ఉంది. నేను ప్రపంచంలో చాలా ఎయిర్‌పోర్ట్‌లు కట్టాను. కానీ మా సొంత ఊరు రాజాం. వైజాగ్ రెండో ఊరు. నా ఫస్ట్ ఎయిర్‌పోర్ట్ హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫౌండేషన్ వేశారు. ఆయనే సీఎంగా ఉండగానే ప్రారంభించారు. రెండు మా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ ఇనాగ్యురేషన్‌కి కూడా వైఎస్సార్ వచ్చారు. ఈ రోజున భగవంతుడి నిర్ణయమో తెలీదు కానీ ఆయన తనయుడు జగన్ తన అమృత హస్తాలతో శంకుస్థాపన చేయడం, వారే మళ్లీ ఇనాగ్యురేట్ చేయాలని భగవంతున్ని కోరుకుంటున్నాను. ఆ సమావేశం ఒక అద్భుతం. నేను కూడా అందులో భాగస్వామ్యం అయ్యాను. ప్రపంచంలో మాకిది 12వ ఎయిర్‌పోర్ట్.. హైదరాబాద్, గోవా తర్వాత మేం నిర్మిస్తున్న మూడో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, ప్రపంచస్థాయి ప్రమాణాలతో మేం నిర్మిస్తాం. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ చేసిన కొత్తలో 1999-2000లో 7 ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఉండగా, ఇప్పుడు 500కు చేరాయి. దీనివల్ల తెలంగాణ రాష్ట్ర ఎకానమీనే మారిపోయింది. అదే విధంగా భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను కూడా కడతాం.. ఇక్కడ కార్గో కూడా ఉండడం వల్ల రైతులకు, మత్స్యకారులకు, ఫార్మా ఇండస్ట్రీకి ఎగుమతులకు ఉపయోగకరంగా ఉంటుంది.. ఇక్కడి సంస్కృతిని చూసి ఈ ఎయిర్‌పోర్ట్ డిజైన్ చేశాం. మేం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ తీసుకున్నప్పుడు అధ్వానంగా ఉండేది.. దానిని నెంబర్ వన్ ఎయిర్‌పోర్ట్‌గా మార్చాం.. అదే విధంగా భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను చేస్తాం, భగవంతుడు కూడా వర్షం రూపంలో మనల్ని దీవించారు.. నేను జీఎంఆర్ తరపున 36 నెలల్లో నెంబర్ వన్ ఎయిర్‌పోర్ట్ కడతానని హామీ ఇస్తున్నాను, మీరే మళ్ళీ ప్రారంభించాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నానన్నారు.

భోగాపురం ఎయిర్‌పోర్ట్ చిరకాల వాంఛ నెరవేరిందని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. సీఎం మాట తప్పకుండా ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తున్నారన్నారు. పాలకులు మంచి వారు అయితే ప్రజలు బాగుంటారు, ఆర్థిక సమస్యలు ఉన్నా ఇన్ని కార్యక్రమాలు చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అని అన్నారు.

## అకాల వర్షాలపై కలెక్టర్లతో సీఎం జగన్ టెలీకాన్ఫరెన్స్

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**



అకాల వర్షాలపై కలెక్టర్లతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో అకాల వర్షాలు, తదనంతర పరిస్థితులపై సీఎం సమీక్ష చేపట్టారు. విశాఖపట్నం పర్యటన నుంచి తిరిగి రాగానే ఆయన సీఎంఓ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అకాల వర్షాల కారణంగా తడిసిపోయిన ధాన్యం కొనుగోలుకు పౌర సరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాల కారణంగా తడిసిన ధాన్యం ఉన్న రైతుల వద్ద నుంచి వెంటనే ఈ ధాన్యాన్ని తీసుకునేందుకు అన్నిరకాల చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు హార్వెస్టింగ్ చేసి ఉన్న ధాన్యం ఎక్కడా ఉన్నా.. వర్షాల బారి నుంచి వాటిని కాపాడ్డానికి చేపడుతున్న చర్యలను మరింత ముమ్మరంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. కొనుగోలు కేంద్రాలు, ఆర్బీకేలు, రైతుల వద్ద కాని ఎక్కడ ధాన్యం నిల్వలున్నా వాటిని వెంటనే అందుబాటులోని గోడౌన్లకు, ఇతర ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలన్నారు. ఎన్యుమరేషన్ ప్రక్రియను కూడా వీలైనంత త్వరగా పూర్తిచేయాలని సీఎం జగన్ ఆదేశించారు.

# 2030 నాటికి గ్లోబల్ డ్రోన్ హబ్‌గా భారతదేశం



**పెనమలూరు (గంగూరు), నేటి పత్రిక ప్రజావార్త :**
ధనేకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో డ్రోన్ పరిశోధన మరియు అభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన గవర్నర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ బుధవారం పెనమలూరు మండలం గంగూరులో ధనేకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో డ్రోన్ పరిశోధన మరియు అభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం డ్రోన్స్ టెక్నాలజీ గురించి డ్రోనిక్స్ ఇంజనీరింగ్ ఇజ్రాయిల్ ప్రతినిధులు గవర్నరుకు వివరించారు. డ్రోన్లలో గల వివిధ భాగాలైన ఫ్లైట్ కంట్రోల్, గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం, సెన్సార్లు, కెమెరాస్, వైర్లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థ, బ్యాటరీ, ప్రొపల్షన్ సిస్టం మరియు పేలోడ్ డెలివరీ సిస్టం పనితనం గురించి వివరించారు. ప్రస్తుతం ఏరోస్పేస్ ఇంజనీరింగ్, రోబోటిక్స్, రిమోట్ సెన్సింగ్, రెగ్యులేటరీ కంప్లయన్స్ మరియు ఆపరేషన్స్ మేనేజ్మెంట్లలో విరివిగా ఉపయోగిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాలు తయారీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ తదితర రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నదన్నారు. కొన్ని సాంకేతికరంగాల్లో డ్రోణుల వినియోగం విస్తరిస్తోందన్నారు. 2030 నాటికి భారతదేశం గ్లోబల్ డ్రోన్ హబ్‌గా అభివృద్ధి చెందనున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ డ్రోనిక్స్ ఇంజనీరింగ్ కంపెనీ, ధనేకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అవగాహనతో ఏర్పాటు చేసిన డ్రోన్ పరిశోధన మరియు అభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కృషిలో భాగస్వాములైన డ్రోనిక్స్ ఇంజనీరింగ్ ఇజ్రాయిల్ ప్రతినిధులను, ధనేకుల కళాశాల యాజమాన్యాన్ని గవర్నర్ అభినందించారు. భారతదేశంలో మరియు విదేశాలలో వేగంగా విస్తరిస్తున్న టెక్నాలజీ మరియు తయారీపై విద్యార్థులకు ఉద్యోగ శిక్షణ మరియు పరిశోధన ప్రాజెక్టులపై ఇంటర్న్షిప్‌లను అందిస్తుందన్నారు. ఏరోనాటికల్ టెక్నాలజీలో నిపుణులు, నిష్ణాతులైన భారత మాజీ రాష్ట్రపతి స్వర్గీయ అబ్దుల్ కలాం స్ఫూర్తిగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని గవర్నర్ సూచించారు. ఈ సందర్భంగా వివిధ ఇంజనీరింగ్ బ్రాంచ్లలో మెరిట్ సాధించిన విద్యార్థులకు గవర్నర్ చేతుల మీదుగా బంగారు, వెండి పతకాలు అందజేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్, ఇజ్రాయిల్ డ్రోనిక్స్ ఇంజనీరింగ్ కంపెనీ సీఈవో నిర్ గెండ్లెర్, జేఎన్టీయూ కాకినాడ వైస్ ఛాన్సలర్ జీవీకే ప్రసాదరాజు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. తొలుత కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితసింగ్, గవర్నర్కు స్వాగతం పలికారు. ధనేకుల ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్ దనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్, డైరెక్టర్ డీకే ఆర్కే రవిప్రసాద్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవి, అకాడమిక్స్ మరియు ఆర్ అండ్ డి డీన్ డాక్టర్ ఆర్.సత్యప్రసాద్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ ఎం.వంశీకృష్ణ మరియు వివిధ విభాగాల అధిపతులు, డ్రోన్ పరిశోధన కేంద్రం ఇంచార్జ్ గంటా విగ్నేష్, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

### పింఛన్‌దారులు ఈనెల 10వ తేదిలోగా

## ఈకెవైసి నమోదు చేసుకోండి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
జిల్లాలోని అన్ని ఉపఖజానా కార్యాలయాల ద్వారా పెన్షన్ పొందుతున్న పింఛన్‌దారులు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈనెల 10వ తేదీలోగా ఈకెవైసి తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా ట్రెజరీ అధికారి యంహెచ్ రహమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులు ఆధార్‌తో అనుసందానమైన ఫోన్ నెంబర్‌ను, ప్రస్తుత నివాస చిరునామాను విధిగా నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్‌తో అనుసందానమైన ఫోన్ నెంబర్ లేని ఎడల ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఫోన్ నెంబర్‌ను ఆధార్ అప్‌డేట్ చేసుకుని అనంతరం జిల్లాలోని ఉపఖజానా కార్యాలయాలకు వెళ్ళి ఇకెవైసి చేయింకోవాలన్నారు. తద్వారా విశ్రాంతి ఉద్యోగికి సాంకేతికతో కూడిన ఆర్థిక భద్రత కల్పించబడుతుందన్నారు. ఈకెవైసి పూర్తి అయితే పింఛన్ దారులు తమ పెన్షన్ వివరాలను ఎస్ ఎం ఎస్ ద్వారా తెలుసుకోనేందుకు వీలు కలుగుతుందని, పింఛన్‌దారుల సౌలభ్యం కోసం ప్రతి పెన్షన్‌దారుడు ఈనెల 10వ తేదీలోగా ఈకెవైసిని నమోదు చేసుకోవాలని జిల్లా ట్రెజరీ అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

## పెంటేల హరికృష్ణకు కాంస్య



**హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త :**
బుకారెస్ట్ గ్రాండ్‌ప్రి అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ కాంస్య పతకం సాధించాడు. రొమేనియాలో జరిగిన ఈ టోర్నీలో నిర్ణీత 10 రౌండ్ల తర్వాత మాక్సిమ్ చిగయెవ్ (రష్యా), డేనియల్ బొగ్డాన్ (రొమేనియా), హరికృష్ణ 8.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు.

అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. చిగయెవ్‌కు టాప్ ర్యాంక్ దక్కగా... బొగ్డాన్‌కు రెండో ర్యాంక్, హరికృష్ణకు మూడో ర్యాంక్ లభించాయి. హరికృష్ణ మొత్తం ఎనిమిది గేముల్లో గెలిచి, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకొని, భారత్‌కే చెందిన యువ గ్రాండ్‌మాస్టర్ రౌనక్‌తో జరిగిన గేమ్‌లో ఓడిపోయాడు.

# సముద్రపు మొగ నుండి 3 కిలోమీటర్ల ప్రధాన కాలువ మార్గంలో 22 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక తొలగింపు !!



**మచిలీపట్నం, నేటి పత్రిక ప్రజావార్త :**

ఈ ఏడాది అక్టోబర్ నాటికి మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులు దాదాపుగా పూర్తవుతాయని ఏపీ మ్యారీ టైం పేజ్ -1 ఫిషింగ్ హార్బర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మునిరెడ్డి తెలిపారు.

బుధవారం మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్ పర్సన్ బీ.వి. కె. డీ నాగలక్ష్మి భవాని విఠల్ స్థానిక గిలకలదిండిలో రూ.348 కోట్లతో ఫిషింగ్ హార్బర్ వద్ద జరుగుతున్న పనులను స్వయంగా ముడా కార్యాలయం సిబ్బంది, మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ డిప్యూటీ మేయర్ పలువురు కార్పొరేటర్లతో కలిసి ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పనులను పరిశీలించేందుకు స్వయంగా వెళ్లారు.

ఏపీ మ్యారీ టైం పేజ్-1 ఫిషింగ్ హార్బర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. మునిరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ మచిలీపట్నం గిలకలదిండిలో సముద్రపు మొగ నుండి 3 కిలోమీటర్ల ప్రధాన కాలువ మార్గంలో 22 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికను డ్రెడ్జర్ల సహాయంతో 70 శాతం తవ్వకం పనులు దాదాపుగా పూర్తయినట్లు వివరించారు.

అనంతరం, మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్ పర్సన్ బీ.వి. కె. డీ నాగలక్ష్మి భవాని విఠల్, మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ తంటిపూడి కవితా థామస్ నోబుల్, తదితరులు మాట్లాడుతూ, మచిలీపట్నంలో సముద్రంలో చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మచిలీపట్నం పరిసర ప్రాంతాల మత్స్యకారుల చిరకాల స్వప్నం మరికొద్ది నెలల్లో ఆవిష్కృతమవుతుందన్నారు, దాదాపు 2009 సంవత్సరం నుండి సముద్రము మొగలో పూడిక తీయించాలని డిమాండ్ ఈ ప్రాంతంలో ఉందన్నారు. కేవలం సముద్రపు పోటు సమయంలోనే చేపల వేటకు వెళ్లే పడవలు తీరానికి వస్తున్నాయని పాటుకు తిరిగే సమయంలో, మొగలో పూడిక సమస్య తీవ్రంగా ఉండడంతో పడవలు సముద్రంలోనికి వెళ్లలేకపోతున్నాయన్నారు. ఈ సమస్య గూర్చి మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, కేవలం మచిలీపట్నంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 చోట్ల ఆధునిక వసతులతో కూడిన ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి, జట్టీల నిర్మాణానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగంగా మత్స్యకారులకు రూ. 348 కోట్లతో మెరుగైన సౌకర్యాలు ఏర్పాటుకు రూపకల్పన జరిగిందని తెలిపారు. మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ పరిధిలో 28 ఎకరాలలో 23 భవనాలు నిర్మితమవుతున్నట్లు చెప్పారు. అందులో ఆక్షన్‌హాల్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, గేర్ కటింగ్, రెస్ట్ హౌస్, పోలీస్ స్టేషన్, పెట్రోల్‌బంక్, రోజుకి 3 వేల ఐస్ బ్లాకులను తయారు చేసే ఐస్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్, క్యాంటీన్, తదితర భవనాలు ఈ ప్రాంగణంలో నిర్మితమవుతాయని చెప్పారు. ఈ సందర్భన కార్యక్రమంలో మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్ పర్సన్ కె.రాజ్యలక్ష్మి , సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ ఎన్ డి ఎస్ ప్రసాద్, స్థానిక కార్పొరేటర్ తిరుమల శెట్టి వరప్రసాద్, పలువురు కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు

## వెంకటేశ్వర స్వామి ఆదేశాలతోనే నాడు తన చెల్లి గంగమ్మ తల్లి ఆలయ ప్రతిష్టాపన

### - గంగమ్మ తల్లి జాతరను ఘనంగా జరుపుకుందాం: భూమన కరుణాకరరెడ్డి

**తిరుపతి, నేటి పత్రిక ప్రజావార్త :**

శ్రీ శ్రీ శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లి ఆలయం దేశంలోనే పురాతనమైనదని జానపద సంస్కృతి తిరుపతి నుండే ప్రారంభమైందని పల్లవుల కాలం నాడే నిర్మింపబడి ఆతరువాత చోళుల కాలంనాడు ఆరాదించబడినట్లు ఆ తరువాత సాక్షాత్తు తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి గంగమ్మ తల్లిని తన చెల్లెలుగా భావించి ఆలయాన్ని పునః ప్రతిష్టించమని రామానుజా చార్యుల సమకాలీకులు, అనంతాల్వారును ఆదేశించారని, అనంతాల్వారు తిరుపతిలో స్వామివారికి ప్రథమ భక్తుడు, తన గురువుగారైన తిరుమల నంబి పేరు మీద కోనేరు తవ్వి గంగమ్మతల్లి ఆలయాన్ని పునః ప్రతిష్టించినట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయని తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకరరెడ్డి వివరించారు. తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి భక్తుడు అనంతాల్వారు తిరుమలలో తన భార్య నిండు గర్భవతిగా ఉన్నప్పుడు స్వామి వారి అభిషేకం కొరకు తిరుమలలో ఒక కోనేరును పరమ భక్తులైన వీరు త్రవ్వారని ఇప్పటికీ అనంతాల్వారు ట్యాంక్ గా పిలువబడుతున్నదని తెలిపారు. తిరుమల నంబిని శ్రీవెంకటేశ్వర స్వామి వారే ముద్దుగా తాత, తాతా అని పిలిచే వారట అందుకే గంగమ్మతల్లి గుడి ముందు తాతయ్య గుంట ను త్రవ్వించారని అందుకే ఈ దేవాలయం తాతయ్యగుంట గంగమ్మ గుడిగా ప్రసిద్ధి చెందిందని అన్నారు. ఆలయ పునః నిర్మాణ పనులు ఈ తరంలో జరగడం, మే 01 నుండి కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభించుకుని మే 05న జగద్గురువు శ్రీశ్రీశ్రీ కంచి కామ కోటి పీటాధిపతులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారిచే శ్రీశ్రీ గంగమ్మ దేవత విగ్రహ పునః ప్రతిష్టాపన జరగనున్నదని అన్నారు. గత 500 ల సంవత్సరాలుగా తిరుమల శ్రీవారి నుండి తన చెల్లెలు గంగమ్మ తల్లికి సారె అందుతున్నదని, భారతీయ సంస్కృతిలో తోడబుట్టిన అక్క చెల్లెమ్మలకు సారె అందించడం మన సాంప్రదాయంగా ఉందని తెలిపారు.

ఈసారి జాతరను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో అమ్మవారి జాతరను ఈనెల 09 నుండి 16వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలలాగా ఈ జాతర మహోత్సవాన్ని నిర్వహించబోతున్నామని వివరించారు. గతంలో గంగమ్మ తల్లిని దర్శించుకుని స్వామివారి దర్శనానికి వెళ్ళేవారని, అందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్వామి వారి బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాలను సమర్పించే ముందు ఆచారం ప్రకారం శ్రీ గంగమ్మ తల్లిని దర్శించుకుని వెళ్ళిన విషయం మనకు తెలిసిందేనని ఈ ఆచారం కొనసాగించాలని ఆశిస్తున్నామని అన్నారు.

**జాతర ప్రాముఖ్యత:**

గంగమ్మ ఆదిశక్తి, అనంత చైతన్య జ్వాలాదీప్తి, అపర కాళికావతారం, కొలిచే భక్తుల కొంగు బంగారం, గంగమ్మ తల్లిగా అవతారం ఎత్తిన ఈ మహాశక్తి గురించిన స్థలపురాణం మొత్తం భక్తిరస చరిత్ర. ఆ రోజుల్లో తిరుపతి పరిసర ప్రాంతాలకు సామంతుడైన 'పాలెగాడు' పరిపాలించేవాడు. వాడు పరమ దుర్మార్గుడు.. ప్రజలను రాచిరంపాన పెట్టే రాక్షసుడు. వాణ్ణి వధించి కాపాడమని జనం ప్రార్థిస్తే, అప్పుడు గంగమ్మ తల్లి ప్రజల కల్పవల్లిగా వానిని తుది ముట్టించాలని నిర్ణయించింది.

ఈ విషయం పాలెగాడికి తెలిసి, ఆ తల్లి కోపానికి జడిసి ఎక్కడికో వెళ్ళి దాక్కున్నాడు. తనను వాడు కనిపెట్టకుండా వాడి కోసం గంగమ్మ తల్లి రోజుకో వేషం వేసి తిరిగింది. చివరికి గంగమ్మ దొర వేషం వేసినప్పుడు పాలెగాడు తన రాజు వచ్చాడని భావించి బైటికి వచ్చిన వాడిని గంగమ్మ తల్లి వధించింది. పాలే గాడి నుండి కాపాడిన గంగమ్మ తల్లిని సంతృప్తి పరిచేందుకు జాతరలో భక్తులు రకరకాల వేషాలు వేస్తుంటారు. బైరాగి వేషం, గారడి వేషం, రౌడీ వేషం, బండ వేషం, ఆడవేషం ఇలా ఏ వేషం వేసినా మదిలోని అహం, మోహంలాంటి అవలక్షణాలను వదిలించుకుంటూ అమ్మ కటాక్ష వీక్షణాలకు పాత్రులవుతూ ఉంటాం.

తిరుపతి ఒకప్పుడు గ్రామం, ఇప్పుడు విస్తరించిన ఆధ్యాత్మిక నగరం, కొందరు బతుకు తెరువు కోసం వచ్చారు. మరి కొందరు అవసరాల రీత్యా వచ్చారు. ఎవరు ఎందుకోసం వచ్చినా ఆ తల్లి అందరిని కాపాడుతూనే ఉంటుంది. అందుకే తిరుపతి సురక్షిత నగరంగా భాసిల్లుతోంది. గత వెయ్యి సంవత్సరాలలో దేశంలో ఎన్నో చోట్ల కలరా మహమ్మారి సోకినా మన తిరుపతి దరిదాపులకు సైతం అది చేరలేదు, ఇది కేవలం మన గంగమ్మ తల్లి చలువే. ఇక్కడ అతివృష్టి లేదు, అనావృష్టి లేదు భయంకరమైన తుఫానులు లేవు. సాఫీగా సాగిపోయే పరిస్థితులే ఉండడం చరిత్రకు తెలుసు, బయటి ప్రాంతాలనుంచి వచ్చి తిరుపతిలో స్థిరనివాసం ఏర్పరుచుకొన్న వాళ్ళెందరో గంగమ్మ తల్లి గొప్పతనాన్ని గురించి, ఆ తల్లి నెలకొన్న గుడి గురించి తెలుసుకోవలసిన అవసరం ఉంది. ఆమె పాదాలకు మోకరిల్లి భక్తి భావనను పెంపొందించుకోవలసిన అవసరం మరింతగా వుంది.

మనమంతా కలిసి అమ్మవారి జాతరను గంగమ్మ తల్లి బ్రహ్మోత్సవాలుగా జరుపుదాం. దేశంలోనే మొదటి గ్రామ దేవత అయిన మన గంగమ్మ వైభవాన్ని జగమంతా చాటుదామని స్థానిక శాసనసభ్యులు భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు.

## అవ్వతాతలకు వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా కంటి పరీక్షలు పూర్తి చేయండి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా 60 సంవత్సరాలు నిండిన అవ్వతాతలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ళజోళ్ళ పంపిణీ, శస్త్ర చికిత్సలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థలకు సూచించారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా కంటి పరీక్షలు నిర్వహణపై మంగళవారం జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు ఆయన కార్యాలయంలో వైద్యాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 60 సంవత్సరాలు నిండిన అవ్వతాతలు సుమారు 2 లక్షల మందికి పైగా ఉన్నారన్నారు. వీరికి జిల్లా ఆంధత్వ నివారణ సంస్థ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళు శస్త్రచికిత్సలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు 74,760 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వీరిలో 13,698 మందికి కంటి శస్త్ర చికిత్సలను నిర్వహించడం జరిగిందన్నారు. 23,775 మందికి ఉచితంగా కళ్ళ జోళ్ళు పంపిణీ చేశామన్నారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా స్వచ్ఛంద సంస్థలైన ఉయ్యూరుకి చెందిన రోటరీ కమ్యూనిటి సర్వీస్ ట్రస్ట్ నందు 2,855, సిబియం ఆసుపత్రి నందు 682, నూజివీడుకు చెందిన గిఫర్డ్ ఆసుపత్రి నందు 2,972, గన్నవరంకి చెందిన సిద్దార్థ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ సైన్స్ నందు 812, తాడిగడపకు చెందిన ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రి నందు 2,593, పెదకాకానికి చెందిన శంకర కంటి ఆసుపత్రి నందు 3,784 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించగా కేవలం 2,770 మందికి సంబంధించిన డేటాను మాత్రమే అప్‌లోడ్ చేయడం జరిగిందన్నారు. శస్త్ర చికిత్సలు నిర్వహించిన వారికి సంబంధించిన డేటాను ఆయా ఆసుపత్రులు ఎట్టిపరిస్థితులలో వారం రోజుల లోపు కంటి వెలుగు పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని జిల్లా ఆంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. త్వరితగతిన పరీక్షలను పూర్తి చేసేందుకు గిఫర్డ్ కంటి ఆసుపత్రి ఒక టీమ్, పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ సైన్సస్ ఒక టీమ్, శంకర కంటి ఆసుపత్రి రెండు టీమ్‌లను అదనంగా ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జిల్లాలో అవ్వతాతలు ప్రతి ఒక్కరికి వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలు పూర్తి చేసి ఆంధత్వ నివారణలో భాగస్వామ్యులు కావాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు కోరారు.

సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. యం.సుహాసిని, జిల్లా ఆంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డా. ఏ వెంకట రమణ, స్పెర్టికల్స్ డిస్టిబ్యుషన్ సెల్ అధికారి రఘురామ్, కంటి వెలుగు డిఇవో కిరణ్‌జ్యోతి, కంటి ఆసుపత్రుల ప్రతినిధులు రవి, ప్రసంగి, రాజశేఖర్, నరేంద్ర, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ సంయుక్త సంచాలకులుగా పి.రత్నాకర్

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**



ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ 2002 బ్యాచ్‌కు చెందిన అధికారి, పి.రత్నాకర్, పదోన్న తిపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం, సి.జి.ఓ.కాంప్లెక్స్, ఆటోనగర్, విజయవాడ నందు సంయుక్త సంచాలకులుగా ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. రత్నాకర్ రెండు దశాబ్దాల కాలంలో సమాచార మరియు ప్రసార మంత్రిత్వశాఖలో వివిధ విభాగాల్లో అధికారిగా పనిచేశారు. పత్రికా సమాచార కార్యాలయం, హైదరాబాద్ లో అసిస్టెంట్ డైరెక్టర్, అలాగే డిప్యూటీ డైరెక్టర్ గా పనిచేసారు. దూరదర్శన్ న్యూస్, విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం అధిపతిగా సేవలందిస్తూ... పదోన్నతి బదిలీ పై విజయవాడలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

## నాబార్డ్ నిధులతో చేపట్టిన ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయండి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

నాబార్డ్ ద్వారా జిల్లాకు మంజూరైన గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి (ఆర్ఐడిఎఫ్) నిధులతో చేపట్టిన ప్రాజెక్టుల పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. నాబార్డ్ ద్వారా ఆర్ఐడిఎఫ్ నిధులతో చేపట్టిన పనుల ప్రగతిపై కలెక్టర్ కార్యాయలయంలో బుధవారం జిల్లా కలెక్టర్ డిల్లీరావు అధ్యక్షతన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నాబార్డ్ ద్వారా 192 ప్రాజెక్టులకు గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి (ఆర్ఐడిఎఫ్) 188.39 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. దీనిలో 154.24 కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు వివిధ శాఖలకు కేటాయించడం జరిగిందన్నారు. వీటిలో ఆంధ్రప్రదేశ్ రిసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్యూషన్‌లో ఒక ప్రాజెక్టుకు 84 లక్షల రూపాయలు, పశుసంవర్ధక శాఖలో ఎనిమిది ప్రాజెక్టులకు 1 కోటి 12 లక్షల 76 వేల రూపాయలు, ఇరిగేషన్ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఐదు ప్రాజెక్టుకు 56 కోట్ల 94 లక్షల 29వేల రూపాయలు, ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషన్‌లో మూడు ప్రాజెక్టు లకు 97 లక్షల 41 వేల రూపాయలు, వ్యవసాయ శాఖలో నాలుగు ప్రాజెక్టులకు 2 కోట్ల 62 లక్షల 84 వేల రూపాయలు, పంచాయతీరాజ్ శాఖలో నాలుగు ప్రాజెక్టులకు 3 కోట్ల 55 లక్షల 84 వేల రూపాయలు, ఆరోగ్యశాఖలో ఐదు ప్రాజెక్టులకు 11 కోట్ల 13 లక్షల 22 వేల రూపాయలు, రోడ్డు భవనాల శాఖలో మూడు ప్రాజెక్టులకు 4 కోట్ల 02 లక్షల 82 వేల రూపాయలు గ్రామీణ నీటి సరఫరా శాఖలో రెండు ప్రాజెక్టులకు 7 కోట్ల 82 లక్షల 57 వేల రూపాయలు, సమగ్ర శిక్ష శాఖలో 59 ప్రాజెక్టులకు 56 కోట్ల 36 లక్షల 88 వేల రూపాయలు, గిరిజన సంక్షేమ శాఖలో ఐదు ప్రాజెక్టులకు 4 కోట్ల 89 లక్షల 15 వేల రూపాయలు, మహిళ శిశు సంక్షేమ శాఖలో 93 ప్రాజెక్టులకు3 కోట్ల 92 లక్షల 46 వేల రూపాయలు కలిపి మొత్తం 154 కోట్ల 24 లక్షల 27 వేల రూపాయల నిధులను ఆయా శాఖలకు కేటాయించడం జరిగిందన్నారు. కేటాయించిన నిధులతో చేపట్టిన 192 ప్రాజెక్టులను సంబంధించి చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు ఆయా శాఖల అధికారులకు సూచించారు. సమావేశంలో నాబార్డ్ ఎజియం మిలింద్ చౌసాల్కర్, జడ్పి సిఇవో జ్యోతిబసు, ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్‌మోషే, డిఇవో సివి రేణుక, ఐసిడిఎస్ పిడి జి.ఉమాదేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్. నాగమణమ్మ, గిరిజన సంక్షేమ అధికారి యం.రుక్మాంగదయ్య, పంచాయతీ రాజ్ ఎస్ఇ ఎ. వెంకటేశ్వరావు తదితరులు ఉన్నారు.

## మాకు న్యాయం చేయండి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

మాకు న్యాయం చేయండి అని షేక్ సయ్యద్ మీర్ సోమవారం విజయవాడ, ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అభ్యర్థించారు. తోటి పార్టనర్స్ తనని మోసం చేశారని, న్యాయం చేయాల్సిన కొందరు అధికారులు తనను ఇబ్బందులకు గురిచేశారన్నారు. కొందరు రాజకీయ ప్రముఖుల వద్దకు వెళ్ళి కూడా తన గోడు చెప్పుకున్నానని తెలిపారు. ఇప్పటికైనా తనకు న్యాయం జరుగుతుందని ఉద్దేశ్యంతో ఇక్కడ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశానన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, అధికారులు తన గోడును అర్థం చేసుకుని తనకు న్యాయం చేయాలని కోరుకుంటున్నానన్నారు. తాను మానసికంగా, ఆర్థికంగా కూడా చాలా ఇబ్బందులకు గురి అవుతున్నానన్నారు. తనకు న్యాయం చేసి ఆదుకోవాలని షేక్ సయ్యద్ మీర్ కోరారు.

## ముఖ్యమంత్రి కొవ్వూరు పర్యటన మే 24కి వాయిదా

### - హోంమంత్రి తానేటి వనిత



**కొవ్వూరు, నేటి పత్రిక ప్రజావార్త :**

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో ఈనెల 5న జరగాల్సిన ముఖ్యమంత్రి పర్యటన మే 24కు వాయిదాకి పడినట్లు రాష్ట్ర హోం మంత్రి, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, వర్షాలు కారణంగా ముఖ్యమంత్రి పర్యటన వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం కొవ్వూరు క్యాంపు కార్యాలయం నుండి ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లకు నగదు పురస్కారాల ప్రదానం మే 24న కొవ్వూరులో నిర్వహిస్తామన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనపై ప్రజా ప్రతినిధులు, నాయకులతో సమీక్ష..

కొవ్వూరులో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర హోంమంత్రి, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, వార్డు మెంబర్స్, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులతో మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం హోంమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశనం చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, అందరి సమిష్టి కృషితో ముఖ్యమంత్రి సభను విజయవంతం చేస్తామని ఆమె తెలిపారు. 'ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా సేవలు అందిస్తున్న వాలంటీర్లకు పురస్కారాలను అందించడానికి తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గానికి ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వస్తుండటం సంతోషకర విషయమన్నారు. ముఖ్యమంత్రి సభ ఎప్పుడు నిర్వహించినా గ్రాండ్ సక్సెస్ చేయడానికి ప్రతి ఒక్క అభిమాని, కార్యకర్త ఉత్సాహంగా ఉన్నారని హోంమంత్రి తానేటి వనిత తెలిపారు.

## ఎంపి సీట్ల విషయంలో లోకల్ అభ్యర్ధులకు ప్రాధాన్యత నివ్వాలి : కోగంటి సత్యం

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**



ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యం కార్మిక సోదరులందరికీ మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1886 మే 1వ తేదీన అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పనిదినాల కోసం కార్మికులు రక్తం చిందించి వారి హక్కులను సాధించుకున్నారన్నారు. కార్మికుల జీవితాల కోసం అసువులు బాసిన మహోన్నత వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని నేటి యువతరం ముందుకు వెళ్ళాలన్నారు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి అనే సిద్దాంతాన్ని మనం ముందుకు తీసుకువెళ్ళాల్సిన పరిస్థితి ఎంతైనా వుందన్నారు. ప్రపంచంలో దోపిడీ వ్యవస్థను అరికట్టాలంటే కార్మికులంతా ఏకం కావాలన్నారు. నేటి రాజకీయ పరిణామాల దృష్ట్యా జనసేన పార్టీ నాయకుడు పవన్‌కళ్యాణ్ పొత్తుల విషయంలో స్థిర నిర్ణయంతో వుండాలన్నారు. గతంలో టీడీపీ నాయకులు చంద్రబాబును నమ్మి తీవ్ర నష్టానికి గురయ్యారని, ఈసారి తప్పుచేయవద్దన్నారు. పొత్తులు కుదుర్చుకుంటే రెండు సంవత్సరాలు జనసేన, రెండు సంవత్సరాలు టీడీపీ, ఒక సంవత్సరం బిజెపి సీఎంలుగా వుండే విధంగా ఒప్పందాలు చేసుకుంటే మంచిదన్నారు. లేకపోతే రాజ్యాధికారం విషయంలో జనసేన పార్టీకి మొండిచేయి చూడాల్సిన పరిస్థితి ఎదురవుతుందన్నారు. పవన్‌కళ్యాణ్ తన బలాన్ని నిరూపించుకునే అవకాశాన్ని ఇప్పటికైనా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పొత్తుల విషయంలో టీడీపీని నమ్మవద్దని సూచించారు. రాజకీయాలు వేడెక్కుతున్న సమయంలో వైసీపీ ఇప్పటికైనా ఇచ్చే ఎంపి సీట్ల విషయంలో లోకల్ అభ్యర్ధులకు ప్రాధాన్యత నివ్వాలని గతంలో ఎంపి సీట్ల విషయంలో జరిగిన పొరపాటును మళ్ళీ పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. లేకపోతే మళ్ళీ పరాజయం చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గతంలో కూడా తాను సర్వే నిర్వహించి అధికార పార్టీకే విజయమని చెప్పానని, ఇప్పుడు కూడా అధికార పార్టీ వైసీపీ వైపే గెలుపు పవనాలు వీస్తున్నాయన్నారు. దేశంలో మన రాష్ట్రంలోనే పేదవాళ్ళకు చెప్పింది చెప్పినట్లుగా అమలుపరుస్తూ, కోరికలు నెరవేరుస్తూ, న్యాయం చేస్తూ పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

# జర్నలిస్టులు సంఘటితం కావడం సంతోషకరం

**– మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు**

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

సమాజంలో జర్నలిస్టుల పాత్ర చాలా విలువైనదని, వీరు సంఘటితంగా ఉండడం ఆనందదాయకమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు అన్నారు. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో మంగళవారం ఉత్తమ జర్నలిస్టులకు ఉగాది పురస్కారాల వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, కేర్ హోమియోకేర్ అధినేత డాక్టర్ ఏఎం రెడ్డి, స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శామ్యూల్ రెడ్డి, డాక్టర్ రామినేని ఫౌండేషన్ కన్వీనర్ పాతూరి నాగభూషణం, యూబ్లడ్ ఫౌండర్, చైర్మన్ యలమంచిలి జగదీష్ బాబు, తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జ్యోతి ప్రజ్వలనగావించారు. అనంతరం తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేడవరపు రంగనాయకులు కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా తెలుగు జర్నలిస్టుల సంఘం కర్తవ్యాన్ని వివరిస్తూ చేసిన పాటను అతిథులు ఆవిష్కరించారు. సంఘం పాట, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, జేడీ లక్ష్మీనారాయణ బయోపిక్‌లు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న వెంకయ్యానాయుడు మాట్లాడుతూ సంచలనాల కోసం వార్తలు రాయకూడదని, నిజాలను ప్రజలకు చేరవేయాలని జర్నలిస్టులకు సూచించారు. తెలుగు జర్నలిస్టులు అందరూ ఏకమవడం, వారిని ప్రోత్సహించేందుకు పురస్కారాలు అందించడం అభినందనీయం అన్నారు. జర్నలిస్టుల కోసం పాటుబడే తెలుగు జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు, నిర్వాహకులను ఆయన అభినందించారు. తెలుగు ప్రాంతం పైన, బాష పైన, వ్యక్తుల పట్ల అభిమానం ఉండాలన్నారు. బాష పైన పట్టు తప్పనిసరి అన్నారు. ప్రస్తుత రోజుల్లో న్యూస్ ఏదో గుర్తించడం కష్టంగా మారిందన్నారు. ప్రస్తుత రోజుల్లో రాజకీయ నాయకులు ఎప్పుడూ ఎవరు ఏ పార్టీలో ఉంటున్నారో కూడా తెలియడం లేదని, ప్రతి ఒక్కరికి రంగుల రాజకీయం కావలసి వస్తుందని చెప్పారు. మంచి విషయాలను జర్నలిస్టులు కూడా వదిలేస్తున్నారని, అదే ఏదైనా బూతులు మాట్లాడే వారికి ప్రాధాన్యమిస్తున్నారని పేర్కొన్నారు. బూతులు మాట్లాడే వారికి పోలింగ్ బూత్ లోనే బుద్ధి చెప్పాలని ఆయన కోరారు.

**న్యూస్‌ను వ్యూస్ కలపొద్దు : సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ**

జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వార్తల సేకరణలో మూడు రకాల పద్ధతులు అవలంబించాలని చెప్పారు. వార్త జరిగిందో? లేదో? తెలుసుకుకోవాలని, వార్తలో నిజాన్ని గుర్తించాలని, అది ప్రజలకు ఉపయోగమా? లేదా? చూడాలని చెప్పారు. ఇప్పటి రోజుల్లో సోషల్ మీడియా మెయిన్ మీడియాను శాసిస్తున్నట్లు కనిపిస్తుందని, ఈ ధోరణి మారాలని ఆయన ఆకాంక్షించారు. జర్నలిస్టు ఉద్యోగం అనేది బాధ్యతతో కూడుకున్నదని, సోమాలియా, సిరియా దేశాలలో కేవలం ఒకే ఒక ఫోటో స్థితిగతుల్లో మార్చేసిందని, ఇది కేవలం జర్నలిస్టులకు మాత్రమే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. నేటి సమాజంలో జర్నలిజం దృక్కోణం మారిందని, ఈ పరిస్థితి సమాజానికి ఆందోళనకరమని ఆయన అన్నారు. ప్రజలకు ఉపయోగపడేదిగా జర్నలిజం ఉండాలని ఆయన సూచించారు.

**నిబద్ధత, క్రమశిక్షణ అవసరం**

సమాజానికి మూల స్తంభం జర్నలిస్టులని, అలాంటి జర్నలిస్టులు క్రమశిక్షణతో వ్యవహరించాలని రామినేని ఫౌండేషన్ కన్వీనర్ పాతూరి నాగభూషణం సూచించారు, యూ బ్లడ్ చైర్మన్ యలమంచిలి జగదీశ్‌బాబు మాట్లాడుతూ రక్తదానం మహాదానంతో సమానమని చెప్పారు. యూబ్లడ్ యాప్ డౌన్లోడ్ చేసుకుంటే ఒక మనిషి ప్రాణాన్ని నిలబెట్టినట్టేనని అన్నారు. డాక్టర్ ఏఎం రెడ్డి మాట్లాడుతూ రేయింబవళ్లు విధుల్లో ఉండే జర్నలిస్టులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. తమ హాస్పిటల్ ద్వారా జర్నలిస్టులకు 50 శాతం ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ శామ్యూల్ రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో జర్నలిస్టులు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. దీన్ని బట్టి జర్నలిస్టుల విలువ ఏంటో అందరికీ తెలుసన్నారు. యువత ను సన్మార్గంలో నిలిపే, ప్రేరణాత్మక కథనాలు రాయాలని జర్నలిస్టులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు నిమ్మరాజు చలపతిరావు, టి డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**28 మందికి ఉత్తమ జర్నలిస్టులకు ఉగాది పురస్కారాలు**



ఈ సందర్భంగా 23 విభాగాలలో ఎంపికైన 28 మంది ఉత్తమ జర్నలిస్టులకు విశిష్ట అతిధులు, ప్రత్యేక అతిధులతో కలిసి ముఖ్య అతిధి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా అవార్డులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారం కూడా అందించారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం "ఉద్యోగం విజయోత్సవం"



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

రాష్ట్రంలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని, దాని ఫలితమే ఉద్యోగ విజయోత్సవమని రాష్ట్ర పర్యాటక, సంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల మరియు క్రీడా శాఖ మంత్రి ఆర్.కె.రోజా తెలిపారు. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని పిళ్ళారిపట్టు పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జరిగిన ఉద్యోగ విజయోత్సవం కార్యక్రమంలో పాల్గొని నూతనంగా ఉద్యోగాలు పొందిన వారికి అపాయింట్మెంట్ ఆర్డర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పిళ్ళారిపట్టు పాలిటెక్నిక్ కాలేజీని ఏ లక్ష్యంతో అయితే అభివృద్ధి చేశానో...ఇంత మంచి భవనాన్ని ఎందుకోసం నిర్మించామో...ఆ లక్ష్యం ఈరోజు నెరవేరినందుకు చాలా సంతృప్తిగా ఉందని అన్నారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ నిర్వహించడం, వారిలో స్కిల్స్ అభివృద్ధి చేయడమే కాకుండా, క్యాంపస్ ఇంటర్వ్యూలు కూడా నిర్వహించి...మన విద్యార్థులకు మంచి ఉద్యోగాలు వచ్చేలా చేయడం నిజంగా చాలా ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలో ట్రైనింగ్ పొందిన వారికి క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఇప్పటికే వివిధ కంపెనీలలో మొత్తం 62 మందికి ఉద్యోగాలు వచ్చాయంటే...ఆ విద్యార్థులనే కాదు, ఇంత మంచిగా శిక్షణ ఇస్తున్నవారికి కూడా అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. మన ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు, మన ప్రభుత్వం ఇచ్చే శిక్షణల వలన ఏడాదికి లక్షా 80 వేల నుండి 2 లక్షల 60 వేల వరకు జీతాలు పొందే ఉద్యోగాలు వస్తున్నాయని అభినందించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగంలో ఆరు లక్షల ఉద్యోగాలు ఇచ్చామని, లక్షా 30 వేల సచివాలయ ఉద్యోగాలు, నాలుగు వేలకు పైగా టీచర్ పోస్టులు, 50 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశామని, 49 వేల ఉద్యోగాలను వైద్యరంగంలో భర్తీ చేశామని, ఇవి కాకుండా ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు విధానంలో వేలాది ఉద్యోగాలు కల్పించామని వివరించారు. భవిష్యత్‌లో దేశంలోను, విదేశాల్లోను ఎక్కడైనా మన పిల్లలు ఉద్యోగాలు పొందాలంటే ఇంగ్లీష్ మీడియం విద్య అవసరం అని...ఇంగ్లీష్ మీడియం విద్యను తీసుకొచ్చారని, అంతేకాదు సీబీఎస్ ఈ విధానాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తీసుకొచ్చి మన విద్యార్థుల భవిష్యత్ కోసం జగనన్న ఆలోచిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపిటిసిలు, సర్పంచ్లు, రాష్ట్ర డైరెక్టర్లు వివిధ కమిటీల చైర్మన్లు, సభ్యులు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్సిపి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రారంభమైన మోక్షనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు



**కమలాపురం రూరల్, నేటి పత్రిక ప్రజావార్త :**

మండల పరిధిలోని రామాపు రం క్షేత్రంలో వెలసిన మహాలక్ష్మి సమేత మోక్షనారాయణ, శ్రీవల్లీ దేవసేన సమేత ద్వికంధర షణ్ముఖ సుబ్రమణ్యస్వా మి వార్షిక బ్రహ్మోత్సవాలు బు ధవారం ప్రారంభమయ్యాయి. గుంటూరుకు చెందిన వేద పండితులు సంతోష్ ఆధ్వర్యంలో పూజా కైంకర్యాలు నిర్వహించారు. మొదటిరోజు మహాగణపతి పూజతో ప్రారం భమై పూజాధికాలు శాస్త్రోక్తంగా ని ర్వహించారు. సాయంత్రం మహాలక్ష్మి సమే త మోక్షనారాయణస్వామి వార్లు హనుమద్వాహనం, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి వార్లు వృషభ వాహనంపై విహరించారు.

## రాష్ట్ర సంక్షేమం, సర్వతో ముఖాభివృద్ధి కోసం అష్టోత్తర శతకుండాత్మక రాజశ్యామల యాగం

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**



రాష్ట్ర సంక్షేమం కోసం, సర్వతోముఖాభివృద్ధి సాధించడం కోసం, ప్రకృతి అన్ని రకాలుగా సహకరించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానాన నిలబెట్టడం కోసం, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పరిపాలన మరింత బలోపేతం అవడం కోసం "అష్టోత్తర శతకుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం" నిర్వహించనున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. మంగళవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో యాగం ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన మంత్రి అనంతరం మీడియాతో మాట్లాడుతూ వరుణదేవుడు వర్షం కురిపించి యజ్ఞశాలను శుద్ధిచేయడం శుభసూచకంగా భావిస్తున్నామ న్నారు. రాష్ట్రం సుభిక్షంగా, సస్య శ్యామలంగా ఉండి, లోక కళ్యాణ హితార్థం రాష్ట్ర ప్రజలు సౌభాగ్యంతో వర్ధిల్లాలనే లక్ష్యంతో స్థానిక మున్సిపల్ స్టేడియంలో మే 12వ తేదీ నుండి 17వ తేదీ వరకు 6 రోజుల పాటు వేదపండితులు, రుత్వికులు, ఘనాపాటిల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా, ఆగమ నియమాలకు అనుగుణంగా రాజశ్యామల యాగం నిర్వహించనున్నామన్నారు. రేపు ఉదయం 7.14గం.లకు బ్రహ్మ ముహూర్తంలో యజ్ఞశాలను ఎద్దుల నాగలితో శాస్త్ర ప్రకారం దున్ని నవధాన్యాలు జల్లి 108 కుండాల నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అంకురార్పణ చేస్తామన్నారు. రాష్ట్ర ప్రజలు సౌభాగ్యంతో వర్ధిల్లాలని చేపట్టే యజ్ఞం మే 12వ తేదీ తొలిరోజు ఉదయం 9 గంటలకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సంకల్పం తీసుకోనున్నారన్నారు. అదే విధంగా యాగం జరిగే 6 రోజుల పాటు దేవాదాయ శాఖ మంత్రిగా యజ్ఞధారణను స్వీకరిస్తానన్నారు. మే 17వ తేదీ ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహా పూర్ణాహుతితో కార్యక్రమం ముగియనుందన్నారు. ఆరు రోజుల మహాయజ్ఞంలో వివిధ ప్రతిష్టాత్మక పీఠాధిపతులు పాల్గొన్ని ప్రజలకు వారు అనుగ్రహ ఆశీర్వచనాలు అందిస్తారని వెల్లడించారు. ప్రధానంగా శ్రీశైలం కంచికామకోటి, శారద, సిద్ధేశ్వర, పుష్పగిరి, శృంగేరి, దత్త పీఠం తదితర పీఠాల పీఠాధిపతులు పాల్గొని తమ ప్రవచనాల ద్వారా హిందూ ధార్మిక పరిరక్షణ గురించి అవగాహన కల్పిస్తారన్నారు. యజ్ఞ క్రతువులో భాగంగా తొలి రోజు విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల దివ్యకళ్యాణం, రెండవ రోజు సింహాచలం శ్రీవరాహ లక్ష్మీ నరసింహస్వామి, మూడవ రోజు అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి, నాల్గవ రోజు ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి, ఐదవ రోజు శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి వార్ల దివ్య కళ్యాణాలు ఉంటాయని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు.

రెవెన్యూ, మున్సిపల్,ఫైర్, హెూం తదితర శాఖలు తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి యాగం విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ మార్పిడిపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు

**–ప్రఖ్యాత నెఫ్రాలజిస్ట్ డాక్టర్ నలమాటి అమ్మన్న**

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

ఓ కిడ్నీ మార్పిడి చికిత్సకు సంబంధించి తమ హాస్పిటల్ పై జరుగుతున్న ప్రచారంలో ఎంత మాత్రం నిజం లేదని అరుణ్ కిడ్నీ సెంటర్ అధినేత, ప్రఖ్యాత నెఫ్రాలజిస్టు డాక్టర్ నలమాటి అమ్మన్న తెలిపారు. సూర్యారావుపేటలోని అరుణ్ కిడ్నీ సెంటర్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ హాస్పిటల్లో 2012లో నిర్వహించిన కిడ్నీ మార్పిడి చికిత్సను వివాదాస్పదం చేస్తూ కొన్ని ప్రసార మాధ్యమాల్లో అసత్య కథనాలు ప్రసారమయ్యాయని చెప్పారు. నిజాలు తెలుసుకోకుండా, వివరణ తీసుకోకుండా కొన్ని మీడియా సంస్థలు వాస్తవ విరుద్ధమైన కథనాలను ప్రసారం చేయడం దురదృష్టకరమని అన్నారు. తమ హాస్పిటల్లో నిర్వహించిన అన్ని చికిత్సల్లోనూ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ వచ్చామని, దాదాపు నాలుగు దశాబ్దాల తమ ప్రస్థానంలో ఏనాడూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించలేదని స్పష్టం చేశారు. ప్రస్తుత అంశంలోకి వస్తే, అధికారిక కమిటీ ఆమోదం తర్వాతే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించామని అన్నారు. కిడ్నీ గ్రహీత వెంకటేశ్వరరావు, దాత శ్రీనివాసరావులిద్దరూ అమలాపురానికి చెందినవారనీ. వాళ్లిద్దరూ బావ బావమరుదులని చెప్పినప్పటికీ అవయవ మార్పిడికి సంబంధించి అధికారిక కమిటీ సమీక్షకు పంపించామని తెలిపారు. దాత, గ్రహీతల మధ్య ఎటువంటి ఆర్థిక లావాదేవీలు జరగలేదని కమిటీ సభ్యులు విశ్వసించడంతోనే కిడ్నీ మార్పిడికి ఆమోదం లభించిందని, పూర్తి చట్టబద్ధంగానే సదరు కిడ్నీ మార్పిడి చికిత్సను నిర్వహించామని వెల్లడించారు. ప్రస్తుతం ఆరోపణలు చేస్తున్న కిడ్నీ దాత శ్రీనివాసరావు 2016లోనూ హైదరాబాదులో పోలీసులకు ఫిర్యాదు చేశాడని, ఆర్థికంగా లబ్ది పొందేందుకే ఇప్పుడు మళ్లీ అతడు ఆరోపణలకు పాల్పడుతున్నాడని అన్నారు. తమ ఆసుపత్రిపై నేరుగా ఆరోపణలు చేయకపోయినప్పటికీ, జరిగిన ప్రచారం వల్ల తమ హాస్పిటల్ ప్రతిష్టకు భంగం కలిగే ప్రమాదం ఉందని ఆందోళ వ్యక్తం చేశారు. ఆర్థిక ప్రయోజనాల కోసం అవయవ దానం చేయడం చట్ట విరుద్ధమని, తనకు ఇస్తానన్న డబ్బులివ్వలేదని ఆరోపిస్తున్న శ్రీనివాసరావు చట్ట ప్రకారం శిక్షార్హుడని అన్నారు. 2012లో కిడ్నీ మార్పిడి జరిగితే పదేళ్ల తర్వాత ఆరోపణలు చేయడం గమనార్హమని తెలిపారు. కిడ్నీ మార్పిడి విషయంలో తాము నిబంధనలను కచ్చితంగా పాటించామని, సదరు వ్యవహారంలో వాస్తవాలను ప్రతిఒక్కరికీ తెలియజేసేందుకే ఈ సమావేశం ఏర్పటుచేశామని డాక్టర్ అమ్మన్న పునరుద్ఘాటించారు.



**అరుణ్ కిడ్నీ సెంటర్ ఆధ్వర్యంలో నిరంతర సేవా కార్యక్రమాలు**

అరుణ్ కిడ్నీ సెంటర్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు డాక్టర్ అమ్మన్న ఈ సందర్భంగా తెలిపారు. ఫ్లోరైడ్ కారణంగా మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న ఎ.కొండూరు మండలంలోని తండావాసుల కోసం ప్రతినెలా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కరోనా విపత్తు సమయంలో ఐదు వేల మందికి కిట్లను ఉచితంగా పంపిణీ చేశామని, ప్రభుత్వ ఆసుపత్రి కోసం రూ.15 లక్షల విలువైన రెండు హెచ్ఎఫ్ఎన్సీ మెషీన్లను అందజేశామని గుర్తుచేశారు. వలస కార్మికులకు భోజన సదుపాయం కల్పించడంతో పాటు, వారికి పాదరక్షలను అందజేశామని చెప్పారు. కోవిడ్-19 బాధితుల కోసం 1500 డయాలసిస్‌లను ఉచితంగా నిర్వహించామని తెలిపారు. ఎస్ఎంసీ అల్యూమినీ ద్వారా రూ.మూడు కోట్ల వ్యయంతో పాత, కొత్త ప్రభుత్వాసుపత్రుల్లో ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటుచేశామని డాక్టర్ అమ్మన్న వివరించారు.

# మే 13, 14 తేదీల్లో అక్రిడేటెడ్ జర్నలిస్టుల కోసం ఉచిత హెల్త్ క్యాంపు

– కొత్తగా అక్రిడేటేషన్ పొందే జర్నలిస్టుల కోసం, క్యాంపులోనే హెల్త్ కార్డులు ఇచ్చేలా డెస్క్ ఏర్పాటు చేసే యోచన

– రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్ తుమ్మా విజయకుమార్‌రెడ్డి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా అహర్నిశలు శ్రమించి విధులు నిర్వహించే జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సదుద్దేశంతో వైద్య ఆరోగ్య శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖల సంయుక్త సౌజన్యంతో అక్రిడేటెడ్ జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు మే 13, 14వ తేదీల్లో రెండు రోజుల పాటు హెల్త్ క్యాంపు నిర్వహించి, ఉచితంగా వైద్య సేవలు అందించనున్నామని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్య శిబిరం గురించి సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనిలు సమాచారశాఖ కమిషనర్ అయిన తనతో పాటు ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు, ఆరోగ్యశ్రీ సీఈవో హరిందర్ ప్రసాద్‌లతో పలుమార్లు సమీక్ష నిర్వహించిన పిదప రెండు రోజుల పాటు మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు టి.విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

అక్రిడేటెడ్ జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ప్రముఖ ఆస్పత్రులకు చెందిన అనుభవజ్ఞులైన వైద్య బృందంచే విజయవాడలోని లయోలా ఇంజినీరింగ్ కాలేజ్‌లో రెండు రోజుల పాటు హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెల్త్ క్యాంపులో సేవలు పొందాలనుకునే అక్రిడేటెడ్ జర్నలిస్టులు తమ వివరాలతో పాటు, కుటుంబ సభ్యుల వివరాలు పొందుపరుస్తూ మే 10వ తేదీలోగా https://forms.gle/UEKdx4fZG7yUGBns7 లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం(హెల్త్ క్యాంపు)లో మామోగ్రామ్, హృద్రోగ సంబంధిత టెస్ట్‌లు, ఈసీజీ, 2డీఎకో, ట్రేడ్ మిల్ టెస్ట్(టిఎంటీ), అల్ట్రా సౌండ్ స్కానింగ్, సీబీపీ, లివర్ ఫంక్షన్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్, థైరాయిడ్, డయాబెటిక్ టెస్ట్‌లు, ఎక్స్‌రే, కళ్లు, డెంటల్ పరీక్షలు వంటి తదితర 17 రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చిన్న పిల్లలకు సైతం అవసరమైన వైద్య సదుపాయం అందించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

హెల్త్ క్యాంపులో నిర్ధారిత పరీక్షలు చేసిన పిదప అత్యవసర వైద్య సేవలు, దీర్ఘకాలిక వ్యాధులకు వైద్య సాయం పొందాల్సి వస్తే ఆరోగ్యశ్రీ అనుబంధిత ఆస్పత్రుల(రిఫరల్ హాస్పిటల్)కు వెళ్లడానికి జర్నలిస్ట్ హెల్త్‌కార్డు తప్పనిసరి కావున కొత్తగా అక్రిడేటెడ్ కార్డులు పొందిన జర్నలిస్టులు హెల్త్ కార్డు పొందడానికి వీలైనంత త్వరగా రూ.1,250 చెల్లిస్తే, దీనికి ప్రభుత్వం తరపున మరో రూ.1,250 చెల్లిస్తామని ఆయన తెలిపారు. అవసరం మేరకు హెల్త్ క్యాంపులో కూడా కొత్తగా హెల్త్‌కార్డు పొందే సదుపాయాన్ని ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు ఆయన వెల్లడించారు. జర్నలిస్టులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ టి.విజయ్‌కుమార్ రెడ్డి కోరారు.

# గృహ నిర్మాణాల ప్రగతిపై యంపిడివోలు రోజువారి పర్యవేక్షణ చేయండి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

గృహ నిర్మాణాలలో యంపిడివోలు, ప్రత్యేక అధికారులు పూర్తి భాధ్యత తీసుకుని, పనుల ప్రగతిపై రోజువారి పర్యవేక్షణ చేసి లబ్దిదారులను చైతన్యవంతులు చేయడం ద్వారా గృహ నిర్మాణాలలో కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. జిల్లాలో జగనన్న గృహ నిర్మాణాలు, నాడు-నేడు పనుల ప్రగతి, స్పందన అర్జీల పరిష్కారంపై స్థానిక కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుండి బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు సంబంధిత అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలను పూర్తి చేయడంలో యంపిడివోలు, ప్రత్యేక అధికారులు పూర్తి పర్యవేక్షణ భాధ్యతలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మాణాల భాధ్యత కేవలం గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్లు, గుత్తేదారులదేనన్న భావన యంపిడివోలు విడనాడి రోజువారి పర్యవేక్షణ చేపట్టినప్పుడే నిర్మాణ పనులు వేగవంతమై త్వరితగతిన పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. గృహ నిర్మాణాలను ప్రభుత్వమే పూర్తి చేస్తుందన్న భావన లబ్దిదారుల నుండి తొలగించి వారిని భాగస్వామ్యులు చేయడం ద్వారా పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు జగనన్న కాలనీలలో దాదాపు 11 వేలకు పైగా గృహ నిర్మాణాలను పూర్తి చేయడం జరిగిందన్నారు. మరో 949 గృహ నిర్మాణాల పనులు ప్రారంభించవలసి ఉందన్నారు. నిర్మాణాలు పూర్తి అయిన వెంటనే విద్యుత్ కనక్షన్‌ను ఏర్పాటు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్దిదారులతో ముఖాముఖి మాట్లాడి నిర్మాణాల పూర్తి చేయడంలో వారికి ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరిస్తే నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పిడి రజనీకుమారి, డిఆర్‌డిఏ పిడి కె. శ్రీనివాస్‌రావు, ఐసిడిఎస్ పిడి జి. ఉమాదేవి, డిఇవో సివి రేణుక, హౌసింగ్ డిఇ రవికాంత్, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి.మహేశ్వరరావు, జిల్లాకు చెందిన మండల స్పెషల్ ఆఫీసర్లు యంపిడివోలు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# గుత్తేదారుల నుండి సీల్డ్ టెండర్లను ఆహ్వానం

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**



నూతన రైతుబజార్లలో సిసి కెమెరాలు, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు, ఆఫీస్ ఫర్నిచర్లను సరఫరా చేసేందుకు ఆసక్తిగల గుత్తేదారులు ముందుకు రావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో ఇటీవల ప్రారంభించిన మూడు నూతన రైతు బజార్లలో 48 సిసి కెమెరాలు, మూడు 30 కేజిల ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు, మూడు 150 కేజిల ఎక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు, మూడు ఆఫీస్ టేబుల్స్, మూడు ఎస్ టైప్ కూర్చీలు,14 ప్లాస్టిక్ కూర్చీలు, మూడు ఇనుప బీరువాలు, రెండు ఇనుపరాక్‌లు సరఫరా చేసేందుకు ఆసక్తిగలిగిన గుత్తేదారుల నుండి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. సరఫరా చేసేందుకు ముందుకు వచ్చే గుత్తేదారులు సంబంధించి కొటేషన్‌లతో ఈనెల 10వ తేదీ సాయంత్రం 5గంటల లోపు టెండర్లను సమర్పించాలన్నారు. టెండర్లతో పాటు 15 వేల రూపాయల ధరావత్తు సొమ్మును అగ్రికల్చర్ మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ రైతుబజార్లు కృష్ణాజిల్లా విజయవాడ వారి పేరున డిడి తీసి జత చేయవలసి ఉంటుందన్నారు. 3 వేల రూపాయలు డిడి రూపంలో చెల్లించి టెండర్ ఫారం పొందాలని సంబంధిత టెండర్ ఫారంతో నియమ నిబంధనలను తెలియజేయడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు విజయవాడ సమీపంలోని గొల్లపూడి మార్కెట్ యార్డ్‌నందు గల జిల్లా అగ్రిట్రేడ్ మరియు మార్కెటింగ్ అధికారి వారి కార్యాలయం నందు స్వయంగా గాని లేదా 91823 61119/91823 61456 లేదా 0866-2972417 నందు సంప్రదించాలని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ ఆ ప్రకటనలో తెలిపారు.

# రాజధాని భూములపై సిట్ దర్యాప్తు యథావిధిగా కొనసాగుతుంది : హోం మంత్రి తానేటి వనిత



**కొవ్వూరు, నేటి పత్రిక ప్రజావార్త :**

అమరావతి భూముల కుంభకోణంపై స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) దర్యాప్తుకు ప్రభుత్వం చేసిన అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకుని మళ్లీ విచారణ జరిపించండని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని, స్వాగతిస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. బుధవారం కొవ్వూరు మంత్రి క్యాంపు కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ అవినీతికి సంబంధించి సిట్ ఏర్పాటుపై 'స్టే' విధిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చేసిన నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసిందన్నారు.

గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కీలక విధాన నిర్ణయాలు, అమరావతి భూ కుంభకోణం సహా భారీ ప్రాజెక్టులలో అవకతవకలు జరగకపోతే దర్యాప్తును ప్రాథమిక దశలోనే ఎందుకు అడ్డుకున్నారని హోం మంత్రి ప్రశ్నించారు.

గత ప్రభుత్వంలో జరిగిన అమరావతి భూముల కుంభకోణం, దళితుల అసైన్డ్ ల్యాండ్స్, ఔటర్ రింగ్ రోడ్డులో అవకతవకలు, భారీ ప్రాజెక్టుల్లో నిబంధనల ఉల్లంఘనలు తదితర అంశాలపై వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వంలో సిట్ ఏర్పాటు చేసి విచారణ చేపడుతున్న సమయంలో హైకోర్టుకి వెళ్లి స్టే తెచ్చుకోవాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ పై గత ప్రభుత్వంలోని నాయకులు స్టే తెచ్చుకోవడం జరిగిందన్నారు. ప్రాథమిక విచారణలో ఉండగానే హైకోర్టులో స్టే తెచ్చుకున్నారని.. గత ప్రభుత్వంలో ఎలాంటి అవినీతి, ఏ అక్రమాలు జరగకపోతే విచారణ ఎదుర్కొవడానికి ఇబ్బంది ఏంటి? అని ప్రశ్నించారు. తప్పు చేశామని భయం ఉండబట్టే స్టే తెచ్చుకున్నారన్నారు. విచారణను ఎదుర్కొని వాళ్ల నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. విచారణ జరిగితే చంద్రబాబు నాయుడు హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు బయటపడతాయన్న భయంతోనే ప్రాథమిక విచారణలో ఉండడానే హైకోర్టు నుండి స్టే తెచ్చుకున్నారని తెలిపారు. గతంలో కూడా ఈ అంశంపై మంత్రివర్గ ఉప సంఘం వేసినప్పుడు భూముల కొనుగోళ్లలో జరిగిన అవినీతి, అక్రమాలను అసెంబ్లీ ముందుకు తీసుకొచ్చారని తెలిపారు. ఆ విషయాలన్నీ అసెంబ్లీ సాక్షిగా చర్చ జరిపి ప్రజల దృష్టికి తీసుకొచ్చామన్నారు.

దర్యాప్తు ప్రాథమిక దశలోనే స్టే ఇవ్వడం సరైంది కాదని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించిందని గుర్తు చేశారు. రాజధాని ప్రాంతంలో జరిగిన ప్రతి అంశాన్ని పారదర్శకంగా విచారణ చేస్తామన్నారు. దోషులు ఎవరూ తప్పించుకోలేరని, ఎప్పటికీ సత్యమే గెలుస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని తానేటి వనిత తెలిపారు.

# హెచ్‌ఎల్ మండో ఆనంద్ ఇండియాతో సాంకేతిక విద్యాశాఖ అవగాహన ఒప్పందం

– సాంకేతిక విద్యాశాఖ కమీషనర్, రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణామండలి చైర్మన్ చదలవాడ నాగరాణి




**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

పాలిటెక్నిక్ విద్యను పారిశ్రామిక రంగానికి మరింతగా అనుసంధానం చేసి విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తును అందించే క్రమంలో హెచ్‌ఎల్ మండో ఆనంద్ ఇండియాతో రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ బుధవారం అవగాహనా ఒప్పందం చేసుకుంది. హెచ్‌ఎల్ మండో ఆనంద్ ఇండియా ప్రతినిధులతో మంగళగిరి సాంకేతిక విద్యాశాఖ కార్యాలయంలో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసారు. కాంచీపురం కేంద్రంగా ఆటోమొబైల్ రంగంలో కీలక భూమిక పోషిస్తూ బ్రేక్‌ల తయారీ, సరఫరాలో ఈ సంస్థ అగ్రగామిగా ఉంది. సాంకేతిక విద్యాశాఖ కమీషనర్, రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణామండలి చైర్మన్ చదలవాడ నాగరాణి, హెచ్‌ఎల్ మండో ఆనంద్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ సారథి ఎంఓయుపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ డిప్లొమా విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ, ఉద్యోగ నియామకాలు, పారిశ్రామిక సంస్థల సందర్శన, అతిథి ఉపన్యాసాలు, పాలిటెక్నిక్ పాఠ్యాంశాల రూపకల్పనలో పరిశ్రమల పాత్ర వంటి అంశాలలో మరింత సమన్వయం సాధించేలా ఈ ఒప్పందం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలు, హచ్‌ఎల్ మండో ఆనంద్ గ్రూప్ మధ్య సహకారాన్ని ఈ ఒప్పందం బలోపేతం చేసుకునేందుకు ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ సంయుక్త సంచాలకులు వి.పద్మారావు, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ విభాగపు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఎవి రామకృష్ణ, హెచ్‌ఎల్ మండో ఆనంద్ గ్రూప్ నుండి మానవవనరులు విభాగపు డిజిఎం రాజశేఖర్ కంచర్ల, మేనేజర్ రాగిణి శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ లెజెండరీ అవార్డ్స్-2023 పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎపి విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ మాట్లాడుతూ అనాదిగా ఈ దేశ సంస్కృతికి మూలస్థంభంలా నిలిచింది విశ్వకర్మలేనని, ఈ నవీన యుగంలో దేశవ్యాప్తంగా సమాజ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్న విశ్వకర్మ మహనీయుల్ని గుర్తించి వారిని సన్మాన పూర్వకంగా గౌరవించుకునే కార్యక్రమమే ఈ విశ్వకర్మ లెజెండరీ అవార్డ్స్ అని, ఏటా వివిధ రాష్ట్రాల్లో నిర్వహిస్తూ ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహిస్తున్నందుకు రాష్ట్రం నలుమూలల నుండి విశ్వకర్మలు తరలివచ్చి ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వకర్మ లెజెండరీ అవార్డ్స్-2023 మరియు విశ్వకర్మ నేషనల్ సమ్మిట్ ఈ సంవత్సరం మే నెల 28వ తేదీన ఆంధ్రప్రదేశ్ విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకట్ విశ్వకర్మ తెలియజేసారు. ఈ కార్యక్రమానికి దాదాపు 10 రాష్ట్రాల నుండి విశ్వకర్మ సమాజ ప్రతినిధులు, పురస్కార గ్రహీతలు పాల్గొంటారని, విశ్వకర్మ సమాజ సంస్కృతి, సంక్షేమం, అభివృద్ధి మొదలగు రంగాల్లో విశేషమైన కృషి చేసినవాళ్లకు ఈ పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామివారి నాటక ప్రదర్శన, రుంజ వాద్య శబ్ద విన్యాస తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మరిన్ని వివరాలకు 9966102201 నెంబరులో సంప్రదించాలని కోరారు.

## ప్రైవేటు బడుల్లో ఉచిత విద్యకు 3023 మంది విద్యార్థుల ఎంపిక

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

ఉచిత విద్యాహక్కు చట్టం కింద మొదటి విడతలో భాగంగా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించిన విద్యార్థుల రెండో జాబితా బుధవారం విడుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ కమీషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి విడతలో మొదటి లాటరీలో మిగిలిన సీట్లను భర్తీ చేస్తూ రెండో జాబితా చేయగా 3023 మంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. ఆ జాబితాను అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు, సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్లకు పంపించామని పేర్కొన్నారు. విద్యార్థులకు కేటాయించిన పాఠశాలల్లో ఈనెల 3వ తేదీ నుండి ఈ నెల 9వ తేదీ లోపు చేర్పించాలని కోరారు.

# పత్రికలు జనం పక్షం నిలవాలి : కొమ్మినేని శ్రీనివాసరావు

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

పత్రికలు జనం పక్షం నిలవాలని, జనం కోసం పోరాడాలని, సి.ఆర్.మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సి.ఆర్. మీడియా అకాడమి ఆధ్వర్యంలో జర్నలిజంలో డిప్లొమా కోర్సు ఆన్‌లైన్ తరగతులకు హాజరైన విద్యార్థులని ఉద్దేశించి పత్రికలు జనం పక్షం నిలవాలని, జనం కోసం పోరాడాలని, సి.ఆర్.మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సి. ఆర్. మీడియా అకాడమి ఆధ్వర్యంలో జర్నలిజంలో డిప్లొమా కోర్సు ఆన్‌లైన్ తరగతులకు హాజరైన విద్యార్థులని ఉద్దేసించి "అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛా దినాన్ని" పురస్కరించుకుని బుధవారం ఆయన మాట్లాడారు. 1991వ సంవత్సరంలో ఆఫ్రికన్ జర్నలిస్టులు విడుదల చేసిన ఒక ప్రకటన ఆధారంగా "యునెస్కో" "అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛా దినాన్ని" ప్రకటించిందని ఆయన వివరించారు. ఇదే రోజు ఆయా దేశాల్లో మీడియా స్వేచ్ఛ పై ర్యాంకింగ్‌లు ప్రకటించడం జరుగుతుందన్నారు. "మానవ హక్కులు పెంపొందింప చేయడంలో మీడియా పాత్ర" అనేది ఈ సంవత్సర థీమ్‌గా యునెస్కో ప్రకటించిందన్నారు. కందుకూరు వీరేశలింగం పంతులు కాలం నుంచి మానవ హక్కుల పై,సామాజిక రుగ్మతలను రూపు మాపే కృషిలో పత్రికలు తమ వంతు పాత్రను సమర్థనీయంగా పోషించాయని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికీ మానవ హక్కుల పరిరక్షణలో ప్రాణాలను సైతం పణంగా పెట్టి పాత్రికేయులు యుద్ధం సమయాల్లోనూ పనిచేయడం మనం చూస్తున్నామన్నారు.

చైనావంటి దేశాలతో పోలిస్తే భారత దేశంలో పత్రికా స్వేచ్ఛ చాలా మెరుగుగా ఉందని ఆయన చెప్పారు. కాకపోతే ఇది రాజకీయాలకతీతంగా వుండడం లేదన్నారు. రాజకీయాలను బట్టి పత్రికా స్వేచ్ఛను అనుభవించడం సరైనది కాదన్నారు. ఆయా రాజకీయ పక్షాలు తమ మీడియాను కలిగి ఉండడం అనేది స్వాతంత్రోద్యమ కాలం నుంచీ వున్న విధానమే అని ఆయన అన్నారు. అసత్య ప్రచారాలకు తావులేకుండా వార్తలు ప్రచురించడం మౌలిక సూత్రం అని ఆయన పేర్కొన్నారు. ఇదెక్కడి పత్రికా స్వేచ్ఛ అనుకునేలా వార్తలు వుండడం వాంఛనీయం కాదన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం వున్న మీడియా స్వేచ్ఛ ముందెన్నడూ లేదని, ఇష్టానుసారం ప్రభుత్వ అధినేత ముఖ్యమంత్రి పైనే వార్తలు ప్రచురించినా ఏమీ అనని పరిస్థితులున్నాయన్నారు.



సంకుచితమైన వ్యాపార ప్రయోజనాలకు రాష్ట్ర అభివృద్ధిని ముడిపెట్టి వార్తలు ప్రచురించడం ప్రజల హక్కుల్ని కాల రాయడమే అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలని ఆయన కోరారు.

కోర్సు కోఆర్డినేటర్ ఎల్.వి.కె.రెడ్డి మాట్లాడుతూ పత్రికలు ప్రతిపక్ష పాత్రనో, అధికార పక్ష పాత్రనో పోషించ కుండా ప్రజాపక్షాన వుండాలని అన్నారు. అభియోగాలకు సంబంధించి రెండవ పక్షం వాదన వార్తలో పొందుపర్చకపోతే అది మౌలిక సూత్రాలకు విరుద్ధం అని ఆయన అన్నారు. వ్యాఖ్యాత, రచయిత నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ, మొదటి ప్రపంచ యుద్ధంలో సమాజం కోసం వ్రాయడం మొదలయిందని, దాన్ని ప్రామాణికంగా తీసుకుంటే జర్నలిజం సుమారు వందేళ్ల చరిత్ర కలిగిందని ఆయన పేర్కొన్నారు. దేశ స్వాతంత్రోద్యమ కాలంలో జాతిని అంతా ఒక్క తాటి మీదకు తేవడంలో మీడియా పనిచేసిందన్నారు. అయితే, మీడియా తమకు కావాల్సిన సమాచారం మాత్రమే, తమకు అనువైన రీతిలో ఇవ్వడం సరికాదన్నారు. ఇలాంటి పరిస్థితులు సరిదిద్దడంలో యూనివర్శిటీలు, మీడియా అకాడమీలు చొరవ చూపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్ ఎపి మీడియా సెక్రటరీ మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్, సి.ఆర్. ఎపి మీడియా కంటెంట్ ఎడిటర్ కలమండ శరత్‌బాబు పాల్గొన్నారు.

Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt Ltd, D.NO: 33-5-5 Papaiah Street, Seethrampuram, VIJAYAWADA, Krishna District , Andhra Pradesh and Published From H.No: 24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line cross, VIJAYAWADA Krishna District Andhra Pradesh.
Editor Konduri Srinivasarao, RNI Title APTEL/2021/80559, Phone :9948877444, Email id: konduri9999@gmail.com